# సంభావ్య భవిష్యత్

ఈ అవమానం తనక్కాదన్నట్లుగా మోరవిరుచుకు తిరగటం సత్యానికి సాధ్యంకాలేదు. "ఈ అవమానం నాకేకాదు. మానవత్వం నశించని ప్రతి మగవాడికీ- అనుకున్నాడుగూడాను. ఆ క్షణంలో సత్యానికి, తన మామగారు ఆయన అరవైయేళ్ళ జన్మలోనూ, మానవత్వం అనేదాని పేరేనా కనీసం వినివుండడని రూఢిగా తోచింది.

ఇంతకన్నా ఘోరమైన అవమానం ఎవడూ చెయ్యలేడు. ఏ తండ్రీ తన యేకొడుక్కూ చెయ్యలేడు. ఏ అన్నా తన యే సోదరుడికీ చెయ్యలేడు ఏ అక్కా తన యే చెల్లెలికీ చేయలేదు, ఏ అత్తా తన యేకోడలికి చెయ్యలేదు, కాని, తన మామగారు తనకు చెయ్యగలడు. అదే చేశాడు కూడా.

తనెరిగివున్నంతవరకూ, మామగారికి నీతి అక్కర్లేదు. తనేం చేస్తున్నాడో, ఆ చర్య యితరులమీద ఎట్లా పరివర్తిస్తుందో ఆయన గణన చెయ్యడు. ఆయనకు కావల్సిందల్లా తనూ, తనవాళ్ళూ ఆయురారోగ్య ధనకనక వస్తువాహనాలతో తులతూగటమే. ఆ మామగారు, సత్యాన్ని సైతం తన వాడిని చేసుకుందామని ప్రయత్నం చెయ్యకపోలేదు.

కాని, మామగారిని మనిషిగా యీ స్థితిలో సహించలేడు. సత్యం ఆలోచించాడు. వీడి కేవిధంగా నేను ప్రత్యపకారం చెయ్యగలను? సత్యం అసలెక్కువగా ఏమీ ఆలోచించడు. ప్రత్యుపకారం చేయటం తెలికే, ఎవడేనా కష్టసమయంలోనాలుగు రూపాయలిచ్చి ఆదుకొంటే, తిరిగీ ఆతని కష్టకాలంలో పదిరూపాయలిచ్చి ఆదరించటం ప్రత్యుపకారం అనిపించుకుంటుంది, ఎవడైనా తననిసభలో గౌరవంగాచూస్తే, ఆ చూచినవాడి గౌరవార్థం మరోసభ చెయ్యగలగటం తేలికే. పోతే, ప్రత్యపకారం దగ్గిర పేచీవచ్చింది. తన నాయనఎట్లా పరాభవించాడో అట్లాగే ఆయన్ని పరాభవించగలగటం సత్యానికి యీ జన్మలో చేతకాదు. ఏమంటే ఇంతవరకూ అతనికి కూతురు లేదు.

ఎప్పుడో పుట్టినా, దాన్ని ఆ మామగారు చేసుకోడు. (అప్పటి కాయన యింకా బతికి వుండటమే సందేహాస్పదం) ఆ పైన భార్యని కాపరానికి పంపమని మామగారు తనని అడగటం ఎటా సాధ్యం అవుతుంది?

బుర్ర వేడెక్కింది కాని మార్గం కనిపించలేదు. "మామకు మామ" అయితేగాని తీరజాలని కసి, యీమర్త్యలోకంలో సాధ్యంకాదు. పోనీ, తన భార్యని ఆయన పంపితేకదా, తనకు కూతురంటూ కలగటం?

లాభంలేదు. తనకి ప్రత్యపకారం ఎట్లా చెయ్యాల్సిందీ తోచటంలేదు.

తనకి ఉత్తరాలకు వెంటనే జవాబురాసే అలవాటు ఎన్నడూలేదు. మామగారే అవుగాక! మరెట్టివాడేనా అవుగాక, ఈ తర్జన భర్జన లెందుకు? తిరుగు టపాలో వుత్తరం వెళ్ళనంతమాత్రాన ఆయనకొచ్చే నష్టం యేముందని?

తను తల్లికడుపున పుట్టినందుకు, ఆ తల్లికొక తమ్ముడుండి, వాడే వీడయినందుకు, వీడి కొక కూతురుపుట్టి (తన ఖర్మంకాలి!) తనకు భార్య అయినందుకు - యీ అవమానం?

మూడుజగాలూ వచ్చి కాళ్ళా వేళ్ళా పడ్డా తను తన మామగారిని క్షమించలేదు, క్షమ అనేది తనకు చేతకాదు, ఏం, ఎందుకు క్షమించాలి? తన అల్లుడిహోదా మామగారు గమనించకపోవటం, తప్పుకాదా?

మామగారేమన్నదీ సత్యానికి అనుక్షణమూ జ్ఞాపకమే.

పాతికేళ్ళు వచ్చి, ప్రపంచపు తుదీ మొదలూ తెలిసినై తనకు, తన విజ్ఞానంతో ఆ మామగారికేం పని? ఆకారానికి మగవాడై, ఆవిడమెళో తాడుకట్టినందుకు గౌరవించాలిగాని-?

జానకి యిన్నాళ్ళకి పెద్దమనిషయిందని వినిపోయినాడు తను. ఆ క్షణంకోసం - మహత్తర క్షణంకోసం - తను ఎన్నాళ్ళనించీ కాచుక్కూర్చు న్నాడో ఆ మామకేం తెలుసు?- అరవై యేళ్ళువొచ్చి, ఆడవాళ్ళతో మాట్లాడుతుంటేనే, వొళ్ళు వొణికే వెధవకి -

అంతవరకూ ఎక్కడవున్నాడో తెలీదు, ఏం చేస్తున్నాడో తెలీదు. వచ్చి పడ్డాడొక్కనాడు.

'ఆనందం!-యింతకన్నా కావల్సిందేముంది?'

'పిల్లది పెద్దదయిందని తెలిసి-'

'ఆ! ఆ!...అవును-'

'అవునా, - మరి నేనూ, అందుకోసమే—'

మాటలెల్లా పూర్తి చెయ్యగలడు తను-? సిగ్గు. లేబాల అందాన్ని ఊహించుకొంటూ-! అందాలరాశి చెంతరావటం అనుకొంటూ-

ఆడవాళ్ళంతా మళ్ళీ తనను తలుపుకన్నాలనించీ చూస్తూ అనువాలు పట్టి, రంకెలు వేస్తున్నారు,

''పెండ్లయింది మొదలు ఎక్కడ తిరిగారో, అంతా నామీద విరుచుకు పడటమే నా వల్ల యింతా జరిగిందని-'' అన్నది జానకి.

ఆ అమాయకపు మాటలు విని, యేడుపు దిగమింగుకున్నాడు తను.

''ఎక్కడికెళ్ళారు యిన్నాళ్ళూ-?''

''ఏమో, తెలీదు-''

''తెలీదా? ఏం? మీకే తెలీదూ, మీరెక్కడ తిరిగిందీ?-''

''గుర్తులేదు. చాలా సంవత్సరాలయిందా నేను యిల్లువొదిలి?''

''అవును. మూడు సంవత్సరాలు-మాటలా మరి!!'

''కావును. నాకేమీ తెలీదు. అంతా యిప్పుడు మీ రనుకొంటూంటే తప్పు-''

''తెలీదా మీకు నిజంగా!''

''నిజంగానే-''

తెలీదు నిజంగానే, ఎక్కడికో వెళ్ళిపోయాడు, తనకేమీ గుర్తులేదు. గుర్తుండకపోవటమే మంచిది.

జానకి ఆనందించింది- తనకి ఆలోచన వచ్చింది వెంటనే అడిగాడు

"ఇన్నాళ్ళూ యేమనుకున్నారు. నన్ను గురించి?-"

"చాలా అనుకున్నారు-"

"అంటే - మీ నాన్న, యేమన్నాడు-"

"ఎవరేమనుకున్నా అంతా నన్ననేవాళ్ళే, అందరూ నన్నే తిట్టటం. నా ఖర్మ అనీ, నావల్ల మీకు కష్టాలు వచ్చినాయనీ-"

"అందరిమాటా కాదు. నువ్వు-?"

జానకి గతుక్కుమన్నది. క్షణం ఆలోచనలో పడ్డది. వెంటనే అన్నది—"నేను-నేనా? చాలా విచారపడ్డాను. నాకేం తోచదు. ఎక్కడ చూచినా మీ విగ్రహమే—మీరే నాకు కనిపిస్తారు. మనస్సులో ఎక్కడా...." కాని ఆ గొంతులో యేదో బెదురుతనం వినిపించింది,

తను విన్నాడు. జానకి నిస్తబ్ధురాలయిపోయింది.

"నేను రాకపోతే యేమయేది?'

"ఏమవుతుంది? ఏమీ కాదు—"

"వస్తే యేమయింది?"

"ఏం కాలేదు —?"

ఇదరూ నవ్వుకున్నారు.

రెండురోజులు గడిచినై.

తనకు కొత్తపోయింది. అందరితో కలిసిపోయాడు తను.

బావమరిది చొరవగా దగ్గరికి వచ్చేవాడు,

వాడి పేరు రంగడు. వీడికింత దగ్గరి చుట్టం యేమిటి తను?

వాడే అడిగాడు ఒకనాడు. 'బావా, నువ్వంటే నాన్నకింత కోపం దేనికి? నువ్వు మంచివాడిలా కనిపిస్తున్నావ్....'

"కోపమా? నాన్నకు? ఎవరి నాన్న?"

"మానాన్న ...."

"ఎందుకూ?"

"ఎందుకో నాకూ తెలీదు. చాలాకోపం. ఒక్కోప్పుడు ఇల్లు ఎగిరి పోయేట్టు అరుస్తాడు. అక్క దూరంగా కూచున్నప్పుడు, నువ్వులేవు గాని, వుంటే మీదపడి కొట్టివుండేవాడు నాన్న నిన్ను. నాకే భయంవేసింది. ఆ రాత్రే అమ్మా నాన్నా అన్నం తినలేదు. అక్క ఏడుస్తూ కూచుంది. ఇంట్లోకి రమ్మంటేరాదు. నాకు సరిగ్గా పక్కవెయ్యలే దవాళ...."

వాడినోరు మూతపడింది. తనకేం తోచలేదు.

ఏమిటిది....?

'మర్నాడేమయింది —'

'నాన్న నీకోసం యిక వెతకలేనన్నాడు-'

'అంతకుముందు వెదికాడా?'

"నీకు తెలీదా ? ఓ! ఎంతవెదికారని పేపర్లో నీ బొమ్మకూడా వేశారు, నువ్వు చూళ్లేదా బావా, సరేకాని, నువ్వెందుకు రాలేదు బావా?...."

వాడికి జవాబు చెప్పటం చేతకాలేదు తనకి.

ఎవరికి జవాబు చెప్పటం చేతౌను కనక?

తనకోసం ఎందుకింత తొ్రటుబాటు? అవసరముంటే తనేరాడా? రాలేదా, యిప్పుడు—అవసరం కలిగినాక? బుద్ధిలేదా యీ మామగారికి, తనకోసం పేపర్లో వేయిస్తాడా? నయం పోలీసులొచ్చి....

ఇదిచాలు తన మామగార్ని చీల్చినా పాపంరాదని వాదించేందుకు. కాని అప్పడే యేమయింది?

* * *

'పద—మాయింటికి పోదాం?—'

'మీ యిల్లెక్కడ'-'

'లేదా, మావూళో?—'

'ఎక్కడుంది? అప్పులకింద ఆ చిన్న పెంకుటిల్లూ సరిపోయింది?'

'అప్పులేమిటి?'

'మీ నాన్న చేసినవి—'

'మానాన్న అప్పులు చేశాడా?'

'ట! నాకుమాత్రం తెలుసునా?'

'నిజంగా?'

'నిజంగా, నాన్న అన్నాడు. మీ నాన్న ఎక్కడో సత్రంలో—'

ఆ వాక్యం జానకి పూర్తిచెయ్యనూ లేదు, అట్లాగని తను కోరనూలేదు?

'మా అమ్మ పోవటం వచ్చింది యింతకూ-' అన్నాడు తను!

'అపున్ట! మీ అమ్మ పాలన లేకనే మీరట్లా అయినారని అంటాడు నాన్న?'

'ఎట్లా అయినాను ?'

'ఎట్లాగో అయినారు.'

'మీకళ్లకు నేను మనిషిలా కనిపించటం లేదా యేమిటి?

'అబ్బ—'

సత్యానికి అర్థంకాలేదు.

మరో రెండురోజులు గడిచాక, తనకు నిజస్థితులు కొద్దికొద్దిగా తెలుస్తూన్నై.

నిజమే మామగారికి కోపం ఎందుకు ?

'నేను రాకపోతే యేమయేదీ ?' అన్నాడు తను మళ్లీ—

జానకి మాట్లాడలేదు. ఆలోచిస్తున్నది. ఈ ఆలోచన తన ప్రశ్నకు సమాధానంకోసం కాదని, తనకి తెలుసు !

'మళ్ళీ పెళ్లిచేసేవాడు మీ నాన్న నీకు—'

దీనికి జానకి మాటాడలేదు. ఆ ముఖం వంక చూస్తూంటే, ఆ మాట లామెకు ఎంత పరిచితమో తేలిగ్గా, తెలిసిపోతుంది.

* * *

మొత్తం ఆరురోజు లున్నాడు ఆ మామగారింట్లో, మొదటి రెండు రోజులూ స్వర్గం, తరువాత రెండురోజులూ స్థాయితగ్గిన స్వర్గం, చివరి రెండు రోజులూ నరకం దాదాపు.

తనమాటకు ఎదురాడాడు—మామగారు.

'జానకిని తీసుకుపోతాను' అన్నాడు తను!

'ఎక్కడికి ?-'

ఎక్కడికయితే తన కెందుకు? దాన్ని చేసుకున్న దెందుకు? అది పెద్దదయిందని తెలిసి యిక్కడికి వచ్చిందెందుకు?

'చూడబ్బాయీ, ఇన్నాళ్ళకు నువు కనిపించావు, రోజులు చక్కబడేంతవరకూ యిక్కడే వుండు! ఎక్కడికని పోతావు?-'

ఈ కఠోరవాక్కులకు తన నరాలు బిగిసిపోయినై, ఎముకలు సడిలినై. ఏమిటంటాడు ఈయన ?

'ఎక్కడికో పోతాను, ఎక్కడికైతేనేం? నాభార్యని తీసుకెళుతాను-' అన్నాడు తను.

'నాకూతురు కాకుండా నీభార్య కాలేదు గదా! నాకూతుర్ని నువెక్కడికో తీసుకెళితే నేనేంకాను? దానికేం సంభవించినా, మనిద్దరిదీ సమాన బాధ్యతే!-' అన్నాడాయన.

'నేనేం చదువుకోనివాడినికాదు, వుద్యోగం చేసుకుంటూ, నాభార్యని పోషించుకుంటాను! మాదారిని మమ్ము పోనియ్యండి' అన్నా డతను.

'ఎక్కడో వుండి వుద్యోగం చేసేదానికన్నా యిక్కడేవుండి చెయ్యరాదా, మరో చోటికి వెళితే యింటికి అద్దె-ఓ! బోలెడన్ని ప్రత్యేకపు కర్చులు'' - మూలిగాడు ముసలాడు.

'మీకేం భయంలేదు, నాబాధ్యత నే నెరుగుదును-' అన్నా డతను.

మొత్తానికి మామగారు అన్నమాటల స్థూలాభిప్రాయంలో తను నిలువ

నీడ లేని వాడు. ఎంతో వుదారుడు కనక ఆయన తనకొక ఆశ్రయం కల్పిస్తు న్నాడు; అందుకు త నాయన కెంతో కృతజ్ఞుడై వుండాలి!-

సత్యం పులకరించాడు. తన మొండితనం బయటపడ్డది-

'వచ్చావుకదా, బాగుపడతా వనుకున్నాగాని, నీ కి దుర్బుద్ధేమిటి?-' పెద్దవాడన్నాడు-

'నాది దుర్బుద్ధో, సుబుద్ధో మీ కవసరం లేదు. నాభార్యని పంపండి-'

'పంపను. ఏంచేస్తావోచెయ్యి!-' దాదాపుగా యివేమాటలు ఆ నోట్లోంచి దొర్లినై.

ఏం చెయ్యగలడు తను?

కోపంకొద్దీ యిల్లు కదిలి వచ్చేశాడు. చివరి ప్రయత్నంకూడా చేసి. జానకి తండ్రిమాట తలదాలుస్తానన్నది!

వొచ్చాడు బజార్లోకి. ఎటు పోయేందు కేమిటో తెలీదు.

ఇదివరకు తనెక్కడ ఆడాడో, పాడాడో గుర్తులేదు. ఒక్క వారం రోజుల్లోనే, అంతా మరుపుకు వచ్చింది.

అవును! బతకలేకపోడు తను, చదువుకున్నవాడు. కనీసం, గంట వాయించే జవానుగానైనా సరే చేరి భార్యని పోషించుకోగలడు. కాని భార్య యేదీ? తన మాట కాదంది. తనతండ్రే దైవమన్నది!

తన భార్యను ఎందుకు పంపడు? - దావావేసి లాక్కుపోతాడు....

ఒకప్పుడయితే, అల్లుడిని ఇల్లరికం ఉంచుకునే స్తోమతు తన మామ గారికి ఉన్నందుకు తను గర్వపడేవాడు. ఇప్పుడు అది మామగారి గర్వం!

పదుగురు నడిచే బాటలో నిలబడి, బుర్ర వేడెక్కుతూండగా ఆలో చిస్తున్నాడు సత్యం. తన మామగారికి ప్రత్యపకారం ఎట్లా చేయటమని. *

(సుభాషిణి)